తనని చుట్టుముట్టి ఉండడం మొదలుపెట్టారు.

సుభద్ర ఒంటి మీద నగలు పెరగటం మొదలైంది. చాలా ఆస్తిపాస్తులు కూడా ఆవిడకు ఏర్పడ్డాయి అని తెలిసింది.

అందరికీ అన్నీ లభిస్తున్నాయి. కానీ తనకే ...

మోక్ష మార్గం కనిపించటం లేదు, తెలియటం లేదు.

ఎలా? ఈ మోక్షకాంక్ష గగన కుసుమమేనా?

కొద్ది రోజులకి తెల్లవారే సరికి ఆశ్రమ మంతా నానా గందరగోళంగా ఉంది.

స్వాముల వారు కనిపించడం లేదు. దేశదేశాలు గాలించారు.

నాలుగు రోజుల తరువాత వచ్చిన ఉత్తరం చెప్పిన మాట -

"నేను తిరిగి రావటం లేదు. రాను, ఈ పాపపు ఆర్జన మీరే అనుభవించండి. ఆశ్రమం మీ అందరిదీ.. మన ఆశ్రమంలో శ్రమ తప్ప, మోక్షానికి తావు లేదు."

స్వామీజీ కోసం వెదకడం మానేశారు. ఎవరు అడిగినా స్వామీజీ హిమాలయాల్లో తపస్సుకు వెళ్లారని, విదేశాలలో ఉన్నారని చెప్పడం మొదలు పెట్టారు.

నాలుగు సంవత్సరాల తరువాత తలవని తలంపుగా ఆయన్ను కలిశాను.

ఆ గడ్డం, మీసాలు, కాషాయ బట్టలు లేవు. దండకమండలాలు లేవు. మంచి ఫాంటు, చొక్కా వేసుకున్నారు. అందరితో సరదాగా మాట్లాడుతున్నారు. ఒక ఇండస్ట్రియల్ కాంటీన్‌లో వడ్డన చేస్తూ కనిపించారు.

నన్ను చూసి గుర్తు పట్టి నవ్వారు. నేను అప్రయత్నంగా నమస్కారం చేయబోయాను.

"స్వామిని కాదు, వలలుడిని" అని అన్నారు.

"మీరు ..." అంటూ ఏదో అడగబోయాను.

"మోక్షాన్ని సాధించాను. ఇతరుల సుఖంలోనే మనకు మోక్షం ఉందని గ్రహించాను. ఈ విషయాలు చాలు, భోజనం చేయండి. అన్నీ వేడివేడిగా ఉన్నాయి!" అంటూ నన్ను ఆశీర్వదిస్తున్నట్టుగా అన్నం గరిటతో పోజు పెట్టి లోపలికి వెళ్లిపోయాడు.

## చైన్ రియాక్షన్

రామచంద్రయ్య చెప్పిన మాట వినగానే స్వాములవారు ఒక్క క్షణం మౌనంగా అతని వంక, అతని కుటుంబం వంక చూశారు.

"మీరు చెప్పినది సరిగ్గా వినపడ లేదు. అందరికి వినబడేలాగా మళ్ళీ యింకొకసారి బిగ్గరగా చెప్పండి" అని స్వాములవారు అనగానే రామచంద్రయ్య వేదిక మీదకు వచ్చి - ముందు స్వాములవారికి - తరువాత సభలోని వారికి నమస్కరించాడు.

తన ఇల్లాలి వంక చూశాడు. ఆవిడ చిరునవ్వుగా తల వూపింది. కుమారుల వంక చూడగా వాళ్ళ ముఖాలలో గర్వం కనిపిస్తోంది.

మామూలు సమయాలలో ఎవరైనా పలకరిస్తే పది మాటలకు ఒక మాట సమాధానం చెబుతూ తనకుగా తాను ఎవరినీ పలుకరించడానికి సాహసించని రామచంద్రయ్య యీనాడు తగుదునమ్మా అంటూ "రాజెవరి కొడుకురా?" అన్నంత ధీమాతో - వేదిక మీద నిలబడగానే - ఆ వ్యక్తిని చూడగానే - జనం విసుగుతో అతని వంక చూశారు.

స్వాములవారు ఒక్క క్షణం అతని వంక అతని కుటుంబం వంక, సభలోని భక్తుల వంక చూశారు.

మొదటిసారి కంటె, రెండవసారి రామచంద్రయ్య కంఠంలో ధైర్యం, స్పష్టత కొట్టవచ్చినట్టు ముఖంలో కనిపిస్తున్నాయి.

స్వాములవారితో నెమ్మదిగా చెప్పిన మాట మళ్ళీ మైకులో బిగ్గరగా చెప్పాడు.

ఆ మరుక్షణంలో ఆ వాతావరణంలో పిడుగు పడ్డంత నిశ్శబ్దం!

మరుక్షణంలో ఎన్నో అగ్నిపర్వతాలు బద్దలై సమాజ సాగరంలో ఎన్నో తుఫానులు, సుడిగుండాలు రేకెత్తించాయి.

స్వాములవారి కుడి చెయ్యి పైకి లేచింది. సభలో కలవరం నెమ్మదిగా సద్దు మణిగింది కాని ఆ వాతావరణంలో ఆగ్రహం ప్రతి అణువునా కనిపిస్తోంది.

ఎప్పుడూ ప్రసన్నంగా, చిదానందంగా ఉండే స్వాములవారి ముఖం అంతులేనంత గంభీరంగా ఉంది.

"త్రేతా యుగంలో మీ ఆదర్శం ధర్మబద్ధం - ఆచరణ సాధ్యం సర్వజన ఆమోద యోగ్యం. యుగాలు మారాయి. ఆచారాలు, వ్యవహారాలు మారాయి. ఇది కలియుగం. ధర్మం త్రిపాద రహితం! ఈనాటి మీ నిర్ణయం - యీ పరిస్థితులలో ఆచరణ యోగ్యమైనా సర్వజన ఆమోదయోగ్యం కాకపోవచ్చును. ఏ కారణంగాగాని - ఏనాడైనా - మీ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని - నలుగురు నడిచే బాటలో నలుగురితోబాటు నడుస్తాను అంటే - మిమ్మల్ని అపార్థం చేసుకోను. ఆడిన మాట తప్పారని నిందించను. ఈ విషయంలో మీ కుటుంబ సభ్యుల ఉద్దేశం . . . . ." అని స్వాములవారు అంటూంటే -

"ఇది మా అందరి నిర్ణయం" అని రామచంద్రయ్యగారి భార్య జానకమ్మగారు సవినయంగా, నెమ్మదిగా మనవి చేశారు. అది అక్కడి ప్రజలకి వెయ్యి లౌడ్ స్పీకర్స్‌లో చెప్పినంత బిగ్గరగా వినిపించింది.

రామచంద్రయ్యగారు, "మీరేమంటారు?" అన్నట్టుగా పిల్లల వంక చూశారు.

ఆ పిల్లలు వారి నాన్నగారికి అంగీకార సూచకంగా తల వూపారు. స్వాములవారి ముఖాన్ని ఆవరించిన మబ్బులు తొలిగిపొయ్యాయి. పెదవుల పైకి నవ్వుల వెన్నెల వచ్చింది.

" మంచిగా వుందామని, మంచి పనులు చేద్దామని ఆలోచించేవారికి - ఎటువంటి సహకారం అందించకపోగా, పైగా అపకారం చేద్దామని మనుష్యులు అనుకునే కాలం ఇది. నేను హృదయపూర్వకంగా మీ కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్నాను - మనసార అభినందిస్తున్నాను. మీకు ఏనాడైనా మనస్సుకి చికాకు, చింత కలిగితే సానుభూతి, ఉపశమనం కావాలనుకుంటే మా ఆశ్రమానికి నిస్సంకోచంగా రండి. మీకు అక్కడ

సర్వదా స్నేహం లభిస్తుంది. అనుక్షణం దైవానుగ్రహం కలుగుతుంది.'' అంటూ స్వాములవారు వారిని దీవించారు.

రామచంద్రయ్యగారు స్వాములవారికి సాష్టాంగ నమస్కారం చేసి ఆయన ఇచ్చిన తీర్థ ప్రసాదాలు తీసుకుని తమ స్థానాలలోకి వచ్చి కూర్చున్నారు.

ఎవ్వరూ వారి వంక చూడలేదు. వారితో మాట్లాడలేదు.

మరునాడు ఉదయం వార్తా పత్రికలలో స్వాములవారి ఉపన్యాసంతో బాటు రామచంద్రయ్య కుటుంబం చేసిన ఘనకార్యం కూడా విపులంగా వివరాలతో సహా వచ్చింది.

ఆ వూరికి క్రొత్తగా వచ్చిన కలెక్టరు గారి చెవిన యీ వార్త పడింది.

ప్రక్కన నిలబడ్డ ఎస్.పి. వంక చూసి "ఇదేదో పబ్లిసిటీ స్టంట్. ఇటువంటి మనుష్యులు చాలా వరకు దగాకోరులు, మోసగాళ్ళుగా ఉంటారు. చిన్న ఎరతో పెద్ద చేపని పట్టాలని ప్రయత్నం చేసేరకం. ఇతన్ని గురించి పూర్తి వివరాలు, పూర్వాపరాలు, ఆస్తిపాస్తులు అన్ని విషయాల రిపోర్టు రెండురోజులలో నాకు పంపండి" అని అన్నారు.

ఆ రోజు సాయంకాలం మెడికల్ అసోసియేషన్ నెలసరి మీటింగులో విషయం. "గర్భిణీ స్త్రీలు - మానసిక వ్యాధులు" అని కరపత్రంలో ఉన్నా ఆ రోజుయీ వైద్య నారాయణులంతా చర్చించిన విషయం-సగం-రామచంద్రయ్య గారు చేసిన పనిని గురించి-రెండవ సగం "హైబ్లడ్ ప్రెషర్ వల్ల గుండెపోటు, పక్షవాతమే కాకుండా చిత్త చాంచల్యం కూడా వస్తుందా?' ' ఉదాహరణ స్థానిక రోగి. పేరు రామచంద్రయ్య!

వయస్సు అరవై బి.పి తప్ప ఎటువంటి అనారోగ్యం లేదు. ప్రతి రోజా సమయానికి మందు వేసుకుంటే 140-80 దగ్గర స్థిరంగా ఉంటుంది.

మానసిక రుగ్మతలు - కారణం లేకుండా ఆవేశం, ఆక్రోశం, దిగులు వంటివి - యీనాటి వరకూ అతనికి లేవు. అతని జీవితంలో చెప్పుకోతగ్గంత ఒత్తిడులు గాని, బాధలు గాని పరిష్కారం చెయ్యడానికి వీలు లేని వీలుకాని సమస్యలు లేవు.

ఇటువంటి వ్యక్తులని గురించి సిగ్మండ్ ఫ్రాయిడ్, కర్ల్ జంగ్, ఎ.ఎ.బ్రిల్ వంటి వాళ్ళు కూడా ఏమీ చెప్పలేదు. ఇప్పుడు ఏం చేయాలి? అంటూ తర్జన భర్జన పడ్డారు.

"మదరాసు తీసుకువెళ్ళి-మెదడు బ్రెయిన్ స్కాన్ చేయిద్దాం. నా వుద్దేశ్యం బ్రెయిన్‌లో - మాలిగ్నెంటు ట్యూమర్ వుందని. నేను ఆబూదాబి, అల్జీరియా, ఇరాన్,సౌదీ అరేబియాలో కూడా ఇటువంటి కేసు చూడలేదు" అంటూ ఒక ఎన్.ఆర్.ఐ. డాక్టరుగారు సెలవిచ్చారు.

"ఇటువంటి రీసెర్చి కార్యక్రమాలకి మన అసోసియేషన్‌లో డబ్బులేదు. వైద్య శాస్త్రం మీద, మానవ ఆరోగ్యం మీద నిస్వార్థమైన ప్రేమ ఉన్నవారు, వారి ఖర్చుతో చేయిస్తే మాకేం అభ్యంతరం లేదు" అంటూ అధ్యక్షుల వారు సెలవివ్వగానే ఎన్.ఆర్.ఐ. డాక్టరు గారు, "విస్కీలో సోడా చాలలేదంటూ" ఆప్రాంతం నుంచి నిష్క్రమించాడు.

"ఇంతకూ ఏమి చేద్దాం?" అంటూ ఒక కంఠం ప్రశ్నించింది.

"మానవుడు సమస్త జంతుకోటిలో మేధావి. తనని గురించి తాను తెలిసికోగలడు. తనకు ఆరోగ్యం తగ్గిందని, అనారోగ్యం ప్రబలిందని బహుశా భలానా రోగం కావచ్చునని

- ఆ రోగ నిర్మూలనానికి వైద్యుడొక్కడే సహాయపడగలడని నమ్మి మన దగ్గరకు వచ్చిన వాడికే మనం, అతను మన షరతులకు అంగీకరించిన పిమ్మటనే, వైద్యం చేయాలి. అలా కాదని మనకుగా మనం బలవంతంగా వైద్యం చేస్తామంటే హిపాక్రటీసుగారు ఒప్పుకోరు. ఆయనకు కోపం వస్తుంది." - ఇది, ఎమ్.బి.బి.ఎస్. సీటు వచ్చే లోపల ఎమ్.ఏ. తెలుగు చదివిన వైద్య పండితుడు. (సాహిత్య శస్త్ర చికిత్సా నిపుణుల) అభిప్రాయం.

ఈ విషయం అక్కడితో ఆగలేదు. రచ్చకెక్కిన విషయం కోర్టు కెక్కింది. బార్ అసోసియేషన్‌లో కూడా యీ చర్చ వచ్చింది. రామచంద్రయ్య చట్ట విరుద్ధంగా ప్రవర్తించాడా ! అని ఒక జూనియిర్ లాయర్ తన సీనియర్‌ని అడిగాడు.

"అలహాబాదు హైకోర్టు గాని, ఢిల్లీ హైకోర్టు గాని యీ విషయంలో ఏమైనా తీర్పు నిచ్చిందేమో చూడు" అంటూ ఆయన ఆ విషయాన్ని పక్కకు మళ్ళించాడు.

"ముందు అతన్ని అరెస్టు చేయిస్తే? కావాలంటే మనలో ఎవరైనా అతని తరుపున బెయిల్ పిటీషన్ మూవ్ చేయవచ్చుగదా" అని అట్టే ఎక్కువ ప్రాక్టీసు లేని లాయిరు అడిగాడు.

"నేరం చేసిన వాడిని అరెస్టు చెయ్యవచ్చు. నేరం చేస్తానని బెదిరించిన వాడిని తాత్కాలికంగా డిటెయిన్ చెయ్యవచ్చు. కాని నేను ఏమీ చెయ్యను అని సభా ముఖంగా చెప్పిన వాడిని ఎలా అరెస్టు చెయ్యడం? ఇంతకీ అతను చేసిన పని చట్ట విరుద్ధమని, నేరమని చెప్పడానికి గట్టి సాక్ష్యాధారాలు లేవు కదా?"

"చేయవలసింది చేయక పోవడం - చేయకూడనిది చేయడం యీ రెండూ నేరాలే కదా" అంటూ సరి కొత్తగా పట్టా కట్టిన కుర్ర లాయరు తన పాఠం అప్పచెప్పాడు.

"ఇది మన స్థాయికి మించిన విషయం. ఏ సుప్రీమ్ కోర్టు జడ్జితోనో ఒక కమీషన్ వేయించి. ఆ కమీషన్ యీ విషయం కూలంకషంగా పరిశీలించి ఒక రిపోర్టు యిస్తే దానిని పూర్తిగా చదివి సమగ్రంగా అర్థం చేసుకుని మనం ఒక నిర్ణయానికి రావాలి"

ఇది వాయిదాల ప్లీడరుగారి సలహా.

"కోర్టులు, కేసులు వాయిదాలు వేయడానికి కాని, వెంటనే విచారించి తీర్పులు చెప్పడానికి కాదు" అని గట్టిగా నమ్మే వ్యక్తులలో ఆయన ఒకడు. (ఈ నమ్మకాన్ని ఆయన నిత్యజీవితంలో కూడా చక్కగా ఆచరణలోకి పెట్టి-అబ్బాయిల చదువు-అమ్మాయిల వివాహాలు వాయిదాలు వేసుకుంటూ - వాళ్ళ జీవితాలలో సుఖ సంతోషాలు - గత నలభై సంవత్సరాలుగా వాయిదాలు వేసుకుంటూ వస్తున్న పెద్ద మనిషి).

సుప్రీమ్ కోర్టు జడ్జీతో కమీషను వేయించడం అంటే మాటలా? రాజకీయ సహాయం కావాలి. ప్రజల సపోర్టు కావాలి.

'పదండి అంటే పదండి' అంటూ-బయలు దేరి మాజీ మంత్రివర్యులు, ప్రస్తుతం ఎటువంటి (పలుకుబడిగాని) పదవులు గాని లేని-తమ శాసనసభ్యుల యింటికి పరుగెత్తారు. రాబోతున్న ప్రమాదం గురించి హెచ్చరించారు.

మాజీ మంత్రివర్యులు - క్షణం కాలం అంతర్ముఖులైయ్యారు.మరుక్షణంలో ఆయన దృష్టి అందరిని దాటి అనంతంలోకి చూసింది.

ఇంకొక క్షణంలో ప్రజల మీద నిలిచింది.

ఇది రాజద్రోహం.

ఇది విప్లవం.

ఇది రాజ్యాంగ విరుద్ధం.

రామచంద్రయ్య చేసిన పనిని మనమంతా ఖండించాలి-అతన్ని గర్హించాలి- మన నిరసనని తెలియపరచాలి.

"ఏం చెయ్యాలో చెప్పండి. మీ అడుగు జాడలలో నడవటానికి మేమంతా సిద్దంగా ఉన్నాం"

"నడవటానికి సిద్దంగా వుంటే సరిపోదు. దేశం క్షేమం కోసం మనం ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కోవాలి. ఎంతటి త్యాగానికైనా సిద్దం కావాలి" అంటూ రాజకీయ నాయకుడు గర్జించాడు.

"ఎంత?" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

"ఇది మీరనుకున్నట్టు స్థానిక సమస్య కాదు. ఒక వ్యక్తికి, అతని కుటుంబానికి మాత్రం పరిమితమైన విషయం కాదు. ఇది రాష్ట్రానికి, మొత్తందేశానికి, సమాజ క్షేమానికి సంబంధించిన క్లిష్టతరమైన ప్రశ్న. ఈ సమస్య జిల్లా నాయకులకు, రాష్ట్రనాయకులకు వారి ద్వారా కేంద్ర నాయకుల దృష్టికి తీసుకువెళ్ళి మన ఎమ్.పీలు, ఎమ్.ఎల్.ఎ లతో ఒక డెలిగేషన్ - నాలాంటి అనుభవజ్ఞుడి నాయకత్వంలో - బయలుదేరి ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రిని తరువాత ప్రధాన మంత్రిని కలుసుకోవాలి.రాష్ట్ర వ్యాప్తంగా, అవసరమైతే దేశ వ్యాప్తంగా ఆందోళన జరపాలి. దాదాపు అయిదారు లక్షలన్నా చేతిలో లేంది. యీ కార్యక్రమం ప్రారంభించలేము" అంటూ మాజీ మంత్రివర్యులు సుదీర్ఘంగా సెలవిచ్చారు.

"ఆందోళనలు, బంద్‌లు చేయడానికి, మనం ప్రతిపక్షంలో లేము. మనది అధికారవర్గం' ' అంటూ ఒక అమాయకుడు చెప్పబోయాడు.

నాయకుడి ముఖంలో క్షణకాలం కోపం కనిపించినా రాజకీయ అనుభవం దానిని కప్పివేసి, ముఖానికి చిరునవ్వు పులిమింది.

"నేను యీ విషయం గురించి ఇప్పుడే కలెక్టరు దగ్గరకు వెళ్ళి మాట్టాడి వస్తాను. నేను తిరిగి వచ్చిన తరువాత మన తక్షణ కర్తవ్యం నిర్ణయిద్దాం" అంటూ హుటాహుటి కలెక్టరు దగ్గరకు బయలుదేరాడు.

కలెక్టరుగారు,ఎస్.పి.గారు, డి.ఎమ్.వో. గారు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు అంతా అప్పటికే సమావేశమై ఉన్నారు. మాజీ మంత్రివర్యులు రావడంతో సభకు నిండు వచ్చింది.

కాఫీలు తాగటం పూర్తి అయిన తరువాత మాజీ మంత్రివర్యులు అలవాటుగా మైకు కోసం అటు ఇటు చూచి అది కలెక్టరుగారి ఆఫీసు అని గుర్తు తెచ్చుకుని, ప్రజాస్వామ్యానికి

రామచంద్రయ్య వల్ల రాబోయే విపత్తును గురించి, దేశానికి వాటిల్లబోయే ప్రమాదం గురించి విస్తారంగా, సవివరంగా విన్నవించుకుంటూ అతను నిర్ణయం మార్చుకునేలాగా ప్రభుత్వం చేయకపోతే ప్రజలలో విప్లవం చెలరేగి అమాయకుల ప్రాణ, మాన, ధనాలకు అపార నష్టం వస్తుందని - అటువంటి పరిస్థితి ఏర్పడకుండా నివారించవలసిందని - శాంతి కాముకులైన, తన నియోజక వర్గంలోని ప్రజలు తరుపున సవినయంగా హెచ్చరిస్తున్నామనీ, ఈ సంఘం విద్రోహ చర్యకు నిరసనగా ఎల్లుండి తన నియోజకవర్గంలోని ప్రజలకు బంద్ పిలుపు ఇచ్చారని-బంద్ సమయంలో సాంఘిక విద్రోహ శక్తులు, చెలరేగి అమాయక ప్రజల ఆస్తులకు నష్టం కలిగించకుండా, మంచి, గట్టి, పోలీసు, సి.ఆర్.పి., మిలటరీ బందోబస్తులు చేయించి ప్రజలను రక్షించవలసిందిగా కలెక్టరుగారిని పదే పదే అర్థిస్తూ, ముఖ్యమంత్రిగారికి యీ విషయం గురించి సమాచారం వైర్‌లెస్ ద్వారా తెలియచేయడం జరిగిందని గుర్తు చేస్తూ ఆయన సభికులకు నమస్కరిస్తూ కూర్చుని ప్రేక్షకులు కొట్టబోయే చప్పట్ల కోసం, మంత్రిగారు వర్థిల్లాలి అనే కేకల కోసం చెవులు రిక్కించుకుని ఒక్క క్షణం ఎదురు చూసినా, అది మహాసభ కాదని - తన ఎదుటి వ్యక్తులు - అమాయక ప్రజలు కారని జిల్లా అధికారులని గుర్తించి చిరునవ్వుగా అందరి వంకా చూసి, మంచినీళ్ళు తాగి గోడ గడియారం వంక చూసి కలెక్టరుగారి వంక చూశాడు.

కలెక్టరు గారు - బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు వంక చూశారు. ఆయన "ఈ విషయం గురించి నేను ఎంతో పరిశోధన చేశాను. రామచంద్రయ్య చర్యను గురించి, ఇంతవరకూ ఏ న్యాయస్థానం ఇది న్యాయవిరుద్ధమని ప్రకటించలేదు. మనం ఆగడం మంచిది" అని సమాధానం ఇచ్చాడు.

వెంటనే డాక్టరుగారు అందుకున్నారు.

"రామచంద్రయ్యగారి పూర్వీకులలో గాని, ఆయనకుగాని మానసిక రుగ్మతలు, అపస్మారం వంటి జబ్బులు ఉన్న దాఖలాలు లేవు. ఆయన మాలో ఎవ్వరి దగ్గరా వైద్యం చేయించుకోవడంలేదు కాబట్టి మేము ఆయన్ని ఆరోగ్యవంతుడిగానే భావిస్తున్నాం. ఈ విషయంలో మేము చేయగలిగింది ఏమీ లేదు" అని సంతృప్తిగా నిట్టూర్పు విడిచాడు.

పోలీసు అధికారి ఏమీ మాట్లాడకుండా తన దగ్గర వున్న రిపోర్టు కలెక్టరు గారి ఎదుట ఉంచాడు.

ఆ రిపోర్టు వివరాలు-

శ్రీ రామచంద్రయ్య 60. ఇండియన్.

హిందు, ఆంధ్రబ్రాహ్మణుడు. మధ్య తరగతి కుటుంబం. భార్య జానికమ్మ. తండ్రి లేటు ఆంజనేయులుగారు. ఆలయ పూజారి!

ఆస్తి- పెద్దలు ఇచ్చిన పెంకుటిల్లు, నాలుగు ఎకరాల మాగాణీ, చిన్న ఉద్యోగిగా ప్రారంభించి పెద్ద ఉద్యోగిగా రిటైరు అయ్యాడు. న్యాయమైన ఆఫీసరుగా పేరు తెచ్చుకున్నాడు. అవినీతి సంబంధమైన నేరాలు గాని, చర్యలుగాని, అతను ఎన్నడూ చేయలేదు. తన క్రింద పని చేసే వారి యెడల చాలా సానుభూతితో డేండేవాడు. ఆయన

అంటే అందరికీ గౌరవం.

సంతానం - ఇద్దరు మొగ పిల్లలు. పెద్దవాడు డాక్టరు, రెండవ వాడు ఇంజనీరు. స్కాలర్ షిప్స్ మీద. బ్యాంకు రుణాలతో కష్టపడి చదువుకున్నారు. ఇద్దరికి చదువుకుంటూ వుండగానే క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగాలు వచ్చాయి. పెద్దవాడికి మెడికల్ కాలేజీలో ఉద్యోగం. రెండోవాడికి పబ్లిక్ సెక్టారులో ఉద్యోగం.

కాలక్షేపం - పేద విద్యార్థులకి ఉచితంగా చదువు చెప్పటం, స్వాములవారు, పీఠాధిపతులు వచ్చినప్పుడు వారికి సేవ చేయడం.

అంతా రిపోర్టు పూర్తిగా విన్నారు.

కలెక్టరుగారు అందరి వంకా చూసి, "ఈ విషయంలో నేను స్వాముల వారి సలహా తీసుకుని ...." అని అంటూ వుండగానే మధ్యలో -

"మనది సెక్యులరిస్టు దేశం" అని మాజీ మంత్రివర్యులు ఏదో అభ్యంతరం చెప్పబోతుంటే -

"అందుకనే నేను స్వాముల వారితో సంప్రదిస్తానని చెప్పింది. ఇది హిందువులకి సంబంధించిన సమస్య-మనం మళ్ళీ కలుసుకుందాం. నేను యీ లోపల హైదరాబాద్ వెళ్ళి సి.ఎమ్. గారితో యీ విషయం స్వయంగా మాట్లాడి వస్తాను. ఈ లోపల సమ్మెలు, బంద్‌లు వగైరా జరిపిన వారి మీద కఠిన చర్య తీసుకోవలసి వుంటుంది" అని అంటూనే చిరునవ్వు నవ్వి లేచి నిలబడ్డాడు.

మీటింగ్ పూర్తి అయిందని గ్రహించి పెద్దలు తమ స్వస్థానాలకి తరలి పోయారు.

రామచంద్రయ్యగారితో పైకి అనకపోయినా ప్రజలలో ఎవరి మనస్సుల్లో వారికి కొన్ని నిర్ణయాలు వచ్చాయి.

రామచంద్రయ్యతో ఎవ్వరూ చుట్టరికం కలుపుకో కూడదు.

అభానికి శుభానికి పిలవకూడదు-మాట్లాడకూడదు. ఈ సమాజ సభ్యుడుగా, యీ నగర పౌరుడుగా అతన్ని గుర్తించకూడదు.

అనాదిగా వచ్చే ఆచారాలని నిర్లక్ష్యం చేసేవారికి యీ గ్రామంలో తావు లేదు అని గుర్తు చెయ్యాలని-

వారికి ఎవ్వరూ నీరు, నిప్పు ఇవ్వకూడదని శాసిద్దామని అనుకున్నారు కానీ, రామచంద్రయ్యగారి యింటోలో గ్యాసుసప్లయ్యివుందని, నీటికి బోర్‌వెల్ వుందని గుర్తుకు రాగానే ఆ ప్రయత్నం మానుకున్నారు.

రామచంద్రయ్యాగారూ, మీ పిల్లలకి పెళ్ళిళ్ళు కావు-పిల్లని ఎవరూ ఇవ్వరు" అంటూ పొరుగింటి పెద్ద మనిషి వార్నింగ్ ఇచ్చాడు.

"ఉలిపికట్టె అవుతావు జాగ్రత్త" అని హెచ్చరించారు.

ఆయనేం మాట్టాడలేదు.

కలెక్టరుగారు హైదరాబాదు నుంచి రాగానే, "ముఖ్యమంత్రిగారు యీ విషయం

గురించి ఆలోచిస్తున్నారు. స్వాముల వారు మౌనంతో వున్నారు. దీక్ష పూర్తి కాగానే మన నగరానికి వస్తామన్నారు" అని చెప్పారు.

కాలం ఆరు మాసాలు గడిచింది. హడావిడి తగ్గింది.

ఈ సమయంలో రామచంద్రయ్య పిల్లలిద్దరి వివాహాలు సలక్షణంగా జరిగాయి.

డాక్టరుకి డాక్టరు భార్య, ఇంజనియర్‌కు ఇంటీరియర్ డెకరేషన్ కోర్సు చదివిన పిల్ల భార్యగా వచ్చారు.

రామచంద్రయ్య, జానికమ్మ అందరినీ పేరు పేరునా, పెళ్ళికి, గృహప్రవేశానికి, సత్యనారాయణ వ్రతానికి పిలిచారు.

కట్టు కట్టుకున్నట్టుగా ఆడా మొగా ఎవ్వరూ ఆ యింటి గడప త్రొక్కలేదు.

రాలేదేమనని రామచంద్రయ్య దంపతులు ఎవ్వరినీ అడగలేదు.

శరద్ నవరాత్రులలో స్వాముల వారు అన్నమాట ప్రకారం ఆ వూరు వచ్చారు.

ఆనాడే ఆ నగరానికి ముఖ్యమంత్రిగారు అధికార పర్యటనలో విచ్చేశారు.

ముఖ్యమంత్రిగారి సన్మాన సభకు స్వాములవారు అధ్యక్షత వహించారు.

ఆ వూరి ప్రజలకి రెండవ సారి హార్ట్ అటాక్ వచ్చే సంఘటన జరిగింది.

ముఖ్యమంత్రిగారికి, కలెక్టరు గారికి మధ్యలో వేదిక మీద రామచంద్రయ్యగారు సతీసమేతంగా కూర్చుని ఉండటం.

స్వామి వారు ఈ దంపతులని ఆశీర్వదిస్తూ, "ఏ భక్తులు యింత కాలం మాకు ఇవ్వనటువంటి అమూల్యమైన కానుకను యీ దంపతులు నాకు యిచ్చారు. అంతులేని ఆనందం కలిగింది. మేమే మహరాజులమై ఉంటే, వారికి మన్యాలు, అగ్రహారాలు ఇచ్చి వుండే వారం. కాని మేము సన్యాసులం. మా దగ్గర ఇవ్వడానికి ఆశీస్సులు తప్ప ఏమీ వుండవే. కాని చంద్రుడికొక నూలు పోగు అన్నట్టు అమ్మగారి అనుగ్రహంతో ఈ చిరుకానుక ఇస్తున్నాను" అంటూ రామచంద్రయ్య గారికి మంచి పండిత శాలువ. జానకమ్మగారికి ఒక పట్టుచీరే, జాకెట్టు గుడ్డ, పండ్లు, పువ్వులు ఇచ్చి ఆశీర్వదించారు.

చప్పట్లు కొడదామనుకున్న చేతులు ఈర్ష్యతో ఆగిపోయాయి.

ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ, "ఆదర్శాలు ఆశయాలు గురించి వేదికలు ఎక్కి పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెప్పే వారిని చాలా మందిని చూశాం. చూస్తున్నాం. ముందు కాలంలో చూస్తాం. కాని, తాము నమ్మిన సిద్ధాంతాన్ని, ధర్మబద్ధమైనదానిని నిర్భయంగా ఆచరించగల వారిని సాధారణంగా చూడం, కనిపించినా అటువంటి -

వారు నూటికి కోటికి ఒక్కరుంటారేమో!! అటువంటి వారిలో ప్రథములు అగ్రగణ్యులు యీ దంపతులు. తోటి వారు పలుకరించక పోయినా, సాటి వారు వెలివేసినా భయపడక, ధర్మం తప్పక కోరిన లక్ష్యాన్ని సాధించిన యీ దంపతులు మన రాష్ట్రవాసులు కావడం మన అందరికీ ఎంతో సంతోషదాయకం, గర్వకారణం. వారికి 'ఉత్తమ పౌరుడు - బెస్ట్ సిటిజన్' అనే బిరుదును యిస్తున్నాను."

రామచంద్రయ్యగారు మౌనంగా భార్య వంక చూశారు. ఆవిడ చిరునవ్వు నవ్వింది.

"మౌనం అంగీకారసూచకం" అంటూ రామచంద్రయ్యగారి మెడలో ఒక దండ వేశాడు. జానకమ్మగారికి శివపార్వతులు ఉన్న పెయింటింగ్ బహూకరిస్తూ -

"జగతః పితరౌ వందే

పార్వతీ పరమేశ్వరౌ" అంటూ తన ఉపన్యాసం ముగించారు ముఖ్యమంత్రిగారు.

"ఏమిటీ హడావిడి?" అంటూ అపుడే ఆలస్యంగా వచ్చిన ఒక పత్రికా విలేకరి రెండవ అతన్ని అడిగాడు.

రెండో అతను పెదవి విరుస్తూ, " అది ముఖ్యమైన విషయం కాదు. అయినా ఎంతో కొంత న్యూస్ రోజూ పంపించాలి గదా న్యూస్ రాసుకో -

"ఆ స్టేజీ మీద కూర్చున్న అమాయకుడు అతని భార్య తమ పిల్లలకి కట్నం తీసుకోమని స్వాముల వారి ముందు ప్రమాణం చేసిన ప్రకారం ఆచరించారు. అందుకని యీ హడావిడి యీ ఉత్సవం." "మూర్ఖులు అన్నికాలాల్లో ఉంటారు !!"

# పున్నామ నరకం

"శివ శంకరంగారు సన్యసించారుట!

హరిద్వారం దగ్గర ఆశ్రమంలో ఉంటున్నారుట."

ఈ వార్త వినగానే ఊరు వాడ మూక ఉమ్మడిగా విస్తుబోయారు. నిశ్చేష్టులయ్యారు. తీవ్ర దిగ్భ్రాంతిని వెలిబుచ్చారు. ఈ వయస్సులో ఇటువంటి ఆలోచన కలిగినందుకు, పరాయి వాళ్లు కూడా జాలిపడ్డారు.

జ్ఞానులు,యోగులు, ఒక్క క్షణం. అంతర్ముఖులై మౌనంగా కలి "మాయ" అని అనుకుంటే.

ముందు కాలంలో మంచి రోజులు వస్తాయి అని నమ్మకం ఉన్నవాళ్లంతా ఈ వార్త విని "ధర్మానికున్న నాలుగోపాదం కూడా పోయిందని కొందరంటే. మరికొందరు.

కలియుగం అంతమై మళ్లీ కృత యుగం ప్రారంభమైయింది అని సంతృప్తి పడ్డారు.

"ఉన్న ఒక్క మంచి కష్టమరు ఎందుకిల్లా అయ్యాడని" బార్ ప్రొప్రయిటరు బాలరాజు బాధపడుతూ వుంటే,

'సరస-సంగీత శృంగార రసికజన మనోభిరాముడు, మానినీ హృదయచోరుడు లేని ఎడారిగా యీ సీమ మారిందని నీలవేణి కుమిలిపోయింది.'

"శ్రీరామ చంద్రుని సత్ సంప్రదాయం.

కృష్ణ పరమాత్మ దక్షిణ నాయకత్వం

'నిత్య నూతనత్వం'-శాశ్వత యవ్వనం"

పెద్దల కన్నా పెద్దరికం-పసివారికన్నా పసితనం